# అద్దం

"రఘూ! నువ్వా! రాత్రక్కడుండి పొద్దున్నొస్తానన్నావు, ఇదేమిటి, సాయంత్రానికే వొచ్చేసేవు!" అడిగింది నిర్మల.

నేను మాట్లాడలేదు. అవమానంతో తిరిగొచ్చేసేనని చెబితే 'అయ్యో పాపం!' అని సానుభూతి చూపెట్టే ఘటం కనకనా!

"ఏమిటి మాట్లాడవు. అసలు గుంటూరు వెళ్లేవా లేదా?"

"వెళ్లేను."

"మీ పెదనాన్న గార్ని కలిసేవా?"

"ముందు స్నానం చెయ్యనీ తర్వాత మాట్లాడతాను."

"స్నానమంటున్నావు. కొంపదీసి మీ పెదనాన్నగారు.."

"అలాంటిదేం లేదు. నిక్షేపంగా వున్నాడు."

"కలిసి మాట్లాడేవా?"

"మాట్లాడేను."

"మనకిస్తానని ప్రామిస్ చేసిన లక్షరూపాయలు ఇస్తానన్నారా?"

"అనలేదు"

"ఏమన్నారు?"

"ముందిట్లోంచి బయటకు పో అన్నాడు."

"ఆయనలాంటి మనిషి కాదే. మనం అడిగేమా పెట్టేమా! నిరుడు ఆయనంతకాయనే 'మీరు విజయవాడలో ఫ్లేట్ కొనుక్కోండి. ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. మీరిద్దరూ సంపాదించుకుంటున్నారు. నేనో లక్ష రెడీ చేసేను, మీకు ప్రెజెంట్‌చెయ్యడానికి, మిగిలింది హౌసింగ్ డెవల్‌మెంట్ కార్పొరేషన్నుంచి, లోన్ తీసుకోండి...."

"ప్లీజ్ నిర్మలా ఇంకిప్పుడా విషయం మరిచిపో."

"నాన్‌సెన్స్! ఎలా మరచిపోతాం! పదిరోజుల క్రితం ఆయన బర్త్‌డే గ్రీటింగ్స్ ఫోన్‌లో చెప్పినప్పుడు కూడా, ఆ మాట ఈ మాటా చెప్పి, ఫ్లేట్ చూసుకున్నారా అని అడిగిన పెద్దమనిషి ఇప్పుడు లేదు పొమ్మంటారా!"

"అలా అనలేదు."

"నువ్వేకదా యిప్పుడన్నావు!"

"ఇంట్లోంచి పొమ్మన్నాడన్నాను. నేనా డబ్బు మాటెత్తలేదు. అడగటానికి అవకాశం రాలేదు."

"నువ్వెళ్లిన రాచకార్యమే అది కదా!"

"అవుననుకో. పుణ్యానికెడితే పాపమెదురొచ్చిందన్నట్టయింది. ఆయన మంచికోరి నేనో మాటంటే రెచ్చిపోయి..."

"పెద్దనాన్నా పెద్దమ్మ పోయినప్పట్నించీ నువ్వొంటరవాడివై పోయేవు. నీకు నిండా అరవయ్యేళ్లు లేవు. నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోకూడదూ! అని బ్రిలియంటె సజెషన్ యిచ్చి వుంటావు. షటప్ ఎండ్ గెటౌటనుంటాడాయన...."

"పోనీ అలాగే అనుకో" అన్నాను- ఇప్పుడా గొడవంతా చెప్పే ఓపికలేక.

"ఏమనుకుంటే ఏం లాభం! ఈ ఆదివారం నాకో ముఖ్యమైన 'సెమినార్' వుంది, వొచ్చే శనివారం సాయంత్రం ఇద్దరం కలిసి వెళ్లి ఓ రోజుండి, ఆ విషయం తేల్చుకొద్దాం మొగుడా! అంటే విన్నావా! అర్జెంట్ అర్జెంట్ అంటూ వెళ్లి మూతి కాలిన పిల్లిలాగ తోకముడుచుకు చక్కావొచ్చేవు."

"అర్జెంట్ కాదా! పదిహేను రోజుల్లో లక్ష ఎడ్వానిస్తామని మాటిచ్చేం"

"లక్ష రూపాయలు తేవడం అర్జెంటే. ఇంట్లోంచి గెంటించుకోవడం అర్జెంట్ కాదు."

"మనకి లక్ష యివ్వడం విషయంలో మనస్సు మార్చుకుని ఈ యెత్తు ఎత్తేడనుకుంటాను."

"ఆ యెత్తులు నా దగ్గిర సాగవు. నేనొస్తున్నానని ఫోన్ చిసి, రేపే శలవు పెట్టి బయలుదేరి వెళ్లి సంగతేమిటో తేల్చుకొస్తాను"

"సరే. నీ ఖర్మ!" అని స్నానానికి లేచేను.

★ ★ ★

ఎంత ఆలోచించినా నేను చేసిన తప్పేమిటో అర్థంకావడం లేదు. రాగానే ఎంతో ఆప్యాయంగా ఆదరించేడు. వంటమనిషి నాగమ్మని పిలిచి ఇద్దరికీ కాఫీ ఫలహారాలు

రెడీ చెయ్యమన్నాడు. చేసింది. తిన్నాం రాత్రికి నేనిక్కడే వుంటానని చెప్పి మాక్కావల్సిన వంటలు పురమాయించేడు.

"ఈ దిక్కుమాలిన తెలుగు టీవీ సీరియల్స్ చూసి చూసి విసుగెత్తిపోయింది. ఎంతసేపూ అసూయ, ద్వేషం, పగ సాధింపులు, ఆత్మహత్యలు, చావులు, దెయ్యాలు, భూతాలు, క్షుద్రశక్తులు, ఏడుపులు! ఆ రాసీవాడికి బుద్ధిలేదు, తీసీ వాడికీ బుద్ధి లేదు, ఈ టీవీ వాళ్లకీ బుద్ధి లేదు. పేపర్ చూసి ఏదైనా ఇంటరెస్టింగ్ కల్చరల్ ప్రోగ్రాంసేమైనా వున్నాయేమో చూడు, లేకపోతే క్లబ్‌కైనా పోదాం. సుబ్బడుతో చెప్పు ఓ అరగంటలో కారు రెడీ చెయ్యమని." అంటూ లేచాడు మా పెదనాన్న.

సదరు సుబ్బడు, ఉరఫ్ సుబ్బారావు, నాగమ్మ భర్త, కారు డ్రయివరు. వీళ్లకో యిద్దరు పిల్లలు. నాగమ్మ తండ్రి వెంకన్న ముప్పయ్యేళ్లుగా నమ్మకమైన బంటు. ఈ పటాలమంతా ఆయన పరివారం. వీళ్లందరూ పేరుకిఅవుట్ హౌసులో వున్నా, వొంతుల వారీగా రాత్రింబగళ్లు ఈ యింట్లోనే వుంటారు, ఆయనకి సందడిగా.

మా పెద్దనాన్న జిల్లా కలెక్టర్ చేసి రిటైరయ్యేడు. మంచివాడన్న పేరుంది. నలుగురు పిల్లల్లోనూ ముగ్గురు విదేశాల్లో స్థిరపడ్డారు. పెద్ద కొడుకు ఢిల్లీలో వుండి వొచ్చి పోతూ వుంటాడు. పుట్టిపెరిగిన వూరు, సొంత యిల్లు, తెచ్చి పెట్టుకున్న ఈ సంసార జంఝాటం విడిచి పెట్టి ఆయన ఎక్కడికీ వెళ్లలేదు.

ఇంకో పది నిమిషాల్లో బయల్దేరదామనుకుంటుండగా, హాల్లో అటూ యిటూ పచారు చేస్తుంటే, అప్రయత్నంగా గోడనున్న అద్దంలోకి చూశాను. స్టోర్ రూంలో నాగమ్మ ఓ డబ్బా చక్కెరతో నింపి, ఓ సంచీలో పెట్టుకుని, ఆ సంచీ చేతిలో పట్టుకుని, స్టోర్రూం తాళం వేసి, ఆ తాళాలు హాల్లో వున్న టేబుల్ మీద వుంచి, సోఫాలో కూర్చున్న నాకేసి చూసి "అయ్యగారికి సెప్పండి, స్టోరు తాళం చెవులు" అంటూ చకచకా హాలుదాటి పోతోంది. నా కళ్ల ముందరే, చెట్టంత మొగాణ్ణిక్కడ వున్నానన్న భయమేనా లేకుండా దొంగతనం చేస్తుంటే ఊరుకోలేక పోయేను.

"నాగమ్మా!" అని పిలిచేను.

"ఏంటి బాబూ!" అంటూ వెనక్కి తిరిగి నాకేసి చూసింది.

"ఆ సంచీలో ఏముందీ?"

"ఖాళీ సంచీ బాబూ! కూరలు తేనాకెడుతున్నా"నంటూ గబగబా వీధి గుమ్మం దాటింది.

"ఆగు. ఆ సంచీలో పెట్టిన చక్కెర డబ్బా...." అన్నానో లేదో–

"ఏమిట్రా కూస్తున్నావు!" అంటూ మా పెద్ద నాన్న బయటకొచ్చి వీధి గుమ్మానికి అడ్డుగా నా ముందు నిలబడి కళ్లెర్ర చేసేడు, నేను నిర్ఘాంతపోయేను.

"ఏంటి బాబూ! సంచీ సూత్తానన్నారంట!" అంటూ సుబ్బడు నాగమ్మని ఆ సంచీ పళంగా జబ్బట్టుకు లాక్కొచ్చి సంచీ తిరగేసి చూపెట్టేడు. ఏముంటుంది! కాళీ సంచి.

గుమ్మం దాటింతర్వాత డబ్బా మాయమవ్వడం ఎంతసేపు! సినీమా ఫక్కీలో నాగమ్మ రాగాలు మొదలెట్టింది. మా పెద్దనాన్న మొహం కందగడ్డలాగయింది.

"నువెళ్లి కూరలు తీసుకురా" అని నాగమ్మతో అనగానే చీర కొంగుతో పొడి కళ్లొత్తుకుని సంచీతో బయటకెళ్లింది.

"దానికి దొంగతనం అంటకడతావా! చూశావా పాపం! ఎంత చిన్నబుచ్చుకుందో!" అన్నాడు నాకేసి తిరిగి.

"అదికాదు పెదనాన్న...."

"డోంట్‌టాక్. సరదాగా ఓ రోజిక్కడ గడపడానికొచ్చిన వాడివి నీపని నువ్వు చూసుకోక ఇంత రభస చేస్తావా!" అన్నాడు తప్పంతా నాదే నన్నట్టు. అదీ సుబ్బడి సమక్షంలో.

"నా కళ్లతో నేను...." అంటూ చెప్పబోతున్నాను.

"స్టాప్ దట్ నాన్‌సెన్స్. మరొక్క మాట మాట్లాడేవంటేఏం చేస్తానో నాకే తెలీదు. గెట్ ది హెల్లవుటాఫ్ హియర్. నా మూడ్ అంతా పాడుచేశావు." అంటూ తన గదిలోకెళ్లి వేసుకున్న బట్టలు తీసేస్తుంటే, ఇంక నాకక్కడ ఉండబుద్ధవ్వలేదు. వెంటనే బయల్దేరొచ్చేసేను.

★ ★ ★

"నువ్వా! అదేమిటి! రాత్రక్కడుండి ఉదయం ఫస్ట్ బస్‌లో వస్తానన్నావు! అసలు గుంటూరెళ్లేవా? మనస్సు మార్చుకుని ఆఫీసు కెళ్లేవా?" అడిగేను, నిర్మలను చూసి. మరో పది నిమిషాల్లో బయల్దేరి హోటల్ కెడదామనుకున్నాను, వంట చేసుకోడానికి మనస్కరించక.

"వెళ్లేను, నువ్వక్కడ చేసిన నిర్వాకం తెలిసింది."

"పెద నాన్న చెప్పేడా?"

"సుబ్బారావు కారు తీసుకుని బస్‌స్టాండ్ కొచ్చేడు. దార్లో నువ్వక్కడ అపర 'షెర్లాక్‌హోమ్స్'లాగ, వెలగబెట్టిన అపరాధ పరిశోధన ఉదంతం అంతా చెప్పేడు.

నిర్ఘాంతపోయి ఇదంతా నాకు తెలీదు, తిరిగొచ్చి నోట మాట రాకుండా నువ్వు అన్నమేనా తినకుండా ముసుగుతన్ని పడుకున్నావనీ, అందుకే సంగతేమిటో తెల్సుకుందామని, రిప్లయ్ పోస్టుకార్డులా గొచ్చేననీ చెప్పేను."

"అలా వాడితో చెప్పు ఏడవడమెందుకు! అసలు చేసిందంతా వాడే."

"ఏం చేసాడో తెలీదు. అతను మాత్రం ఎంతో మర్యాదగా 'అమ్మాయిగోరూ! జరిగిపోయిందేదో జరిగిపోయింది. అంతా మా గెహచారం. రఘుబాబుగార్ని మా మీద కోపం పెట్టుకుని ఇక్కడికి రావడం మానెయొద్దని చెప్పండి. అయ్యగారి సంగతి తమకి తెలిందేటుంది! కోపమొస్తే గడ్డిమంటలాగెగిసి పోతారు మళ్లీ ఛనంలో సల్లారిబోతారు. రఘుబాబుగారలా గెల్లిపోకుండా పది నిమిషాలు కూసునుంటే లెగిసోచ్చి "పదా క్లబ్బుకు పోదాం" అని యెంటెట్టుకుపోదురు' అన్నాడు."

"సరే వాడి ప్రబోధంతా విన్నావు...."

"విని కారు దిగగానే నా సంచీలోంచి వాళ్ల కోసం పట్టుకెళ్లిన ఓ పాత పట్టుచీర, ఓ సఫారీ సూటు, ఓ స్వీట్ పేకట్టూ అతని చేతిలో పెట్టాను."

"ఏ సఫారీ సూటు?"

"అదే గ్రే కలర్ చెక్స్.."

"అది కుట్టించుకు ఆర్నెల్లవ్వలేదు."

"అవును, అందుకే. మరీ పాతదంత మంచివాడికిస్తే ఏం బావుంటుందీ!"

"మా పెద్దనాన్నేమన్నాడు?"

"వెళ్లగానే నేను పట్టుకెళ్లిన పళ్లబుట్ట ఆయన పక్కన పెట్టి పాదాలకు నమస్కరించేను"

"సినిమా ఫక్కీలో"

"నాన్‌సెన్స్, మానవ సహజమైన గౌరవాభిమానాల్తో"

"ఊ.... సరే"

"నన్నాశీర్వదించి రఘూ ఎలా వున్నాడు. ఏం చెప్పేడూ అని అడిగేరు. పశ్చాత్తాపంతో కుమిలి కుమిలి ఏడుస్తున్నావని చెప్పేను.."

"నీకసలు బుద్ధుందా.... !"

"మధ్యలో మాటకి అడ్డు రాకు. పాపం! ఆయన కూర్చున్న కుర్చీకి ఎదురుగా, ఎత్తుగా గోడకి అమర్చిన అద్దంకేసి చూపెట్టి రహస్యంగా, 'అందులో చూస్తుంటే నాకన్నీ

కనబడుతూ వుంటాయి. పెద్దపెద్ద చదువులు చదువుకున్న వాళ్లే లంచాలు, దగాలూ, మోసాలు, దురాశకి పాల్పడుతున్న రోజులివి. నేనెన్నోసార్లు అలాంటి సంఘటనలు చూశాను. చూసి నవ్వుకుంటాను. దీన్ని దొంగతనమనను. నన్ను అడగటానికి మొహమాటపడి ఏదో తీసుకుపోతుంది. ఎంత తీసుకుపోతుంది! ఎందుకు తీసుకుపోతుంది! ఎవరి కోసం తీసుకుపోతుంది!" అన్నారు.

"అవును మామయ్యగారూ! వాళ్లు పరాయివాళ్లు కారు. ఈ వయస్సులో మిమ్మల్ని అహర్నిశలు కనిపెట్టుకుని, మీ బాగోగులు చూసుకునే ఆత్మబంధువులు" అన్నాను. ఆయన విశాల భావాలకి, దూర దృష్టికి అనుగుణంగా."

"రఘు తొందరపడ్డాడు. ఈ అద్దం రహస్యం ఎక్కడ బయట పడుతుందో అని నేనూ కంగారు పడి వాడి నోరు నొక్కే ప్రయత్నంలో..."

"ఏమీ పరవాలేదు. తండ్రి లేని రఘూకి తండ్రిలాంటి వారు, దైవసమానులు. ఛివాట్లు పెట్టే అధికారం మీకుంది" అన్నాను.

"దానికంత అవమానించడమెందుకు! "ఓరే, రఘూ! ఇలారా" అని గదిలోకి పిలిచి...." నేను చెప్పబోయేను.

"నీకంత గౌరవం దక్కాలంటే, నువ్వు చూసింది రహస్యంగా మీ పెద్దనాన్నగారితో చెప్పి వుండాల్సింది. అయినా రఘూ! డబ్బాడు చక్కెర తీసుకుపోతే దొంగతనం అన్నావు. మనం ఏ అధికారంతోటి, ఏ ధర్మసూక్ష్మం ఆధారంగా ఆయన దగ్గిర్నుంచి లక్ష రూపాయలు ఆశిస్తున్నాం!" అంది నిర్మల.

"సరే నాకు జ్ఞానోదయం అయింది. ఇంతకీ నువ్వా లక్ష రూపాయల సంగతీ అడిగేవా లేదా?"

"ఇంత జరిగేక ఆయన్ని ఏం మొహం పెట్టుకు అడగను! వెళ్లి నువ్వు పెట్టిన చిచ్చును చల్లార్చి వొచ్చేను. జరిగిందానికి ఆయన బాధపడి త్వరలోనే నేనే విజయవాడ వొస్తాను. నాకు వాడి మీద కోపం ఏమీ లేదని చెప్పు అంటూ, చెబుతానో, చెప్పనో అని యీ వుత్తరం నీకిమ్మన్నారు" అంటూ కవర్ టీపాయ్ మీద పడేసి లోపలికెళ్లింది.

అయిష్టంగానే కవరు చింపి చూశాను. అందులో లక్షా పదిహేను వేలకి డ్రాఫ్ట్.

* *రచన, సెప్టెంబరు, 2001*